క్లుప్తంగా

నేడు మహిళా సాధికారత అవగాహన సదస్సు

కొమరాడ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మహిళా సాధికారత అవగాహన సదస్సు శనివారం నిర్వహించనున్నట్లు రెండో అదనపు జిల్లా జడ్జి, లీగల్ సర్వీసెస్ కమిటీ అధ్యక్షుడు ఎస్. దామోదరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా చట్టాలపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. మహిళా భవన నిర్మాణ కార్మికులు, వ్యవసాయ మహిళా కార్మికులు, మత్స్యకార మహిళలు, ఇంటి పనివారు అందరూ హాజరు కావాలని కోరారు.

స్వచ్ఛమైన తాగునీటి సరఫరాకు చర్యలు


రక్షిత పథకంలో క్లోరినేషన్ చేయిస్తున్న ఈఓపీఆర్‌డీ గోపాలరావు

గరుగుబిల్లి : స్వచ్ఛమైన తాగునీటి సరఫరాకు చర్యలు చేపడుతున్నట్లు ఈఓపీఆర్‌డీ ఎల్. గోపాలరావు తెలిపారు. మండల కేంద్రంలోని జీఎల్ఎస్ఆర్ రక్షిత పథకాన్ని శుక్రవారం పరిశీలించి క్లోరినేషన్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తుఫాన్ కారణంగా తాగునీరు కలుషితం కాకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి

గరుగుబిల్లి: తుఫాన్ కారణంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తడి చేతులతో స్విచ్‌లు వేయడం గాని ఆపడం గాని చేయరాదని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసనాయుడు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరలతో మాట్లాడుతూ, ముఖ్యంగా ఇంట్లో చిన్నపిల్లలు విద్యుత్ బోర్డులను తాకకుండా చూడాలన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామస్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎక్కడైనా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే తక్షణమే తమకు సమాచారం అందించాలన్నారు.

జగనన్న జన్మదిన వేడుకలు విజయవంతం చేయండి

గరుగుబిల్లి: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు జగన్ మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించనున్నామని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, ఎంపీపీ ఉరిటి రామారావు, జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆర్టీసీలో కార్గో సేవలు మరింత విస్తృతం..

- 48 గంటల్లో గమ్యస్థానానికి సరుకు
- వినియోగదారులకు అందుబాటులో ధరలు
- ఆదాయ కల్పనపై యంత్రాంగం దృష్టి


రవాణాకు సిద్ధంగా ఉన్న గిరిజన పంటలు

పాలకొండ రూరల్: సురక్షిత ప్రయాణానికి మారుపేరుగా నిలుస్తున్న ఆర్టీసీ సంస్థ ఆదాయ కల్పనలో భాగంగా కార్గో సేవలను మరింత విస్తృతం చేస్తోంది. సంస్థ ఆదాయ వనరులను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికబద్ధంగా ముందుకు వెళ్తోంది. ఈ క్రమంలో తమ వాహనాల్లో కొన్నింటిని సరుకు రవాణా చేసేందుకు కేటాయించింది. వినియోగదారుల అవసరాల మేరకు వారి సరుకులను సుదూర ప్రాంతాలకు తక్కువ పైకం తీసుకుంటూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేస్తోంది. పాలకొండ ఆర్టీసీ కాంప్లెక్స్ వేదికగా ఏపీ రోడ్డు రవాణా సంస్థ పార్సిల్ రవాణా కార్యాలయాన్ని ప్రారంభించింది. తద్వారా వినియోగదారులు కోరుకున్న చోటకి సరుకు రవాణా చేస్తున్నారు.

48 గంటల్లో....

స్థానిక కార్యాలయంలో వినియోగదారులు తమ వస్తువులను ప్యాకింగ్ రూపంలో అందిస్తే వాటి బరువు, వస్తువుల భద్రత, ఆవశ్యకతను దృష్టిలో పెట్టుకుని అందుకు తగ్గ రుసుం చెల్లించాల్సి ఉంటుంది. నగదు తీసుకున్న తర్వాత సిబ్బంది రశీదు అందజేస్తారు. పార్సిల్ బుక్ చేసిన 48 గంటల్లో గమ్యస్థానానికి చేరుస్తారు. ఏజెన్సీ కలబోసి ఉన్న పాలకొండ నియోజకవర్గంతో పాటు ఈ ప్రాంతం నుంచి దాదాపు వందకు పైబడి బస్సులు విశాఖ, విజయవాడ మీదుగా సుదూర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటాయి. వీటి పరిధిలో ఆర్టీసీ సరుకు రవాణా చేపడుతోంది. ముఖ్యంగా ఏజెన్సీ నుంచి గిరిజనులు పండించే సంప్రదాయ పంటలు, కూరగాయలను ఇక్కడ నుంచి ట్రాన్స్‌పోర్ట్ విధానంలో ఇతర ప్రాంతాలకు సురక్షితంగా చేరవేస్తారు. ముఖ్యంగా కూరగాయలు, గిరిజనులు సేద్యం చేస్తున్న పచ్చి పంటల రవాణాకు రాయితీ కూడా అందిస్తున్నారు. అలాగే సరుకు రవాణా సమయంలో తమ పార్సిల్ ఎక్కడివరకు చేరిందన్న అంశాన్ని తెలుసుకునేలా 'రూట్ ట్రాక్‌సిస్టమ్' సౌకర్యం కూడా కల్పిస్తున్నారు. ఎంత సమయంలో తమ వస్తువులు చేరుతాయో కూడా తెలియజేస్తుండడం విశేషం.


ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన పార్సిల్, కొరియర్ కేంద్రం

డోర్ డెలివరీ సౌకర్యం....

స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో గల పార్సిల్ పాయింట్ నుంచి నిర్దేశించిన పట్టణ పరిధిలో చుట్టుపక్కల 10 కిలోమీటర్ల వరకు సరుకు డోర్ డెలివరీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. కార్గో ద్వారా సగటున నెలకు ఆర్టీసీకు దాదాపు రూ.2 లక్షల వరకు ఆదాయం సమకూరుతోంది. ప్రైవేట్ పార్సిల్ సర్వీసులకు దీటుగా 101 ఆర్టీసీ షెడ్యూల్స్ పరిధిలో దాదాపు 40 గ్రామాల వరకు పార్సిల్ సేవలందించేలా యంత్రాంగం చర్యలు తీసుకుంది. ప్రైవేట్ పార్సిల్ సర్వీసులతో ఆర్టీసీ కార్గో సర్వీస్ ఎంతో భద్రం. పైగా ఏడు రోజుల వ్యవధిలో ఫిర్యాదులను కూడా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి..



వినియోగదారులు ఆర్టీసీ కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలి. పార్సిల్ బుక్ చేసినప్పటి నుంచి గమ్యస్థానం చేర్చేవరకు పూర్తి భద్రత కల్పిస్తున్నాం. ఇందుకు సంబంధించి aprrtc of irtic r.in వెబ్‌సైట్‌ను పొందుపర్చాం. ఎటువంటి ఫిర్యాదులున్నా 08662 570006 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయవచ్చు. అలాగే వాట్సాప్ ద్వారా ఫిర్యాదులు అందించేందుకు 73828 25588 నంబర్‌ను వినియోగించవచ్చు. వినియోగదారుల సలహాలు తీసుకుని పార్సిల్, కొరియర్స్ సర్వీసులను మరింత విస్తృతం చేస్తాం.

– పి.వెంకటేశ్వరరావు, ఆర్టీసీ డీఎం, పాలకొండ

దరఖాస్తుల ఆహ్వానం..

సీతంపేట: భామిని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఖాళీగా ఉన్న ఎకనామిక్స్ పోస్టు భర్తీకి సంబంధించి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ ఎకనామిక్స్‌లో కనీసం 50 శాతం మార్కులతో పాటు బీఈడీ, ఉపాధ్యాయ అర్హత పరీక్షలో ఉత్తీర్ణత సాధించాలని పేర్కొన్నారు. ఇంగ్లిష్ మీడియంలో బోధించాల్సి ఉంటుందని తెలిపారు.ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 28లోగా సీతంపేట గురుకులం సెల్, భామిని ఈఎంఆర్ఎస్‌లో దరఖాస్తులు అందజేయాలన్నారు.

రైతులను ఆదుకోవాలి

పాలకొండ: తుఫాన్ కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని అభ్యుదయ రైతు ఖండాపు ప్రసాదరావు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. నెల రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని.. వరి చేను తడిసిపోవడంతో మొలకలు వచ్చాయని పేర్కొన్నారు. అపరాల పంటలకు కూడా నష్టం ఏర్పడిందని చెప్పారు. ప్రభుత్వం స్పందించి రైతులకు ఆర్థిక సాయం చేయడంతో పాటు రంగుమారిన ధాన్యం కొనుగోలు చేయాలని కోరారు.



గొడుగులతో నిరసన ..

గిరిజన గురుకులాల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఐటీడీఏ ముఖ ద్వారం వద్ద చేస్తున్న రిలే నిరాహార దీక్షలు 32వ రోజుకు చేరాయి. శుక్రవారం కురిసిన జోరు వానలోనూ గొడుగులు వేసుకుంటూ నిరసన తెలిపారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో బి.గణేష్, ఎస్.మోహనరావు, కె.భవానీ, బి.ధర్మారావు, కె.బాలరాజు, ఎల్.రవి, కె.లింగరాజు, ఎస్.నాగేంద్ర, ఎస్.సూర్యనారయణ, తదితరులు పాల్గొన్నారు. – సీతంపేట

నేడు తోటపల్లి ప్రాజెక్ట్ కమిటీ ఎన్నికలు

వీరఘట్టం: తోటపల్లి ప్రాజెక్ట్ కమిటీ ఎన్నికలు శనివారం జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. ఈ ఎన్నికల్లో వీరఘట్టం, రావివలస, తూడి, ఎం .సింగుపురం, రాజులగుమ్మడ డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షులు పాల్గొంటారు. 20 ఏళ్లుగా ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్లుగా దమలపాటి వెంకటరమణ, నిమ్మక పాండురంగలు వ్యవహరించారు. ఈ సారి చైర్మన్ గిరీ ఎవరికి వరిస్తుందో చూడాలి మరి.

వట్టిగెడ్డ ప్రాజెక్టుకు..

జియ్యమ్మవలస: మండలంలోని రావాడ వట్టిగెడ్డ రిజర్వాయర్ ప్రాజెక్ట్ చైర్మన్ ఎన్నిక శనివారం నిర్వహించనున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు పల్ల రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారని పేర్కొన్నారు.

రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు


వర్షపు నీరుతో నిండిన గురండి రోడ్డు

భామిని: మండలంలోని రోడ్లన్నీ అధ్వానంగా ఉండడంతో వర్షాలకు జలమయమయ్యాయి. మండల కేంద్రంలోని ఏబీ రోడ్డు పరిస్థితి అయితే మరీ దారుణంగా ఉంది. రోడ్డంతా గోతులతో నిండిపోవడంతో వర్షపు నీరు చేరింది. దీంతో రాకపోకలకు వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని చాలా రోడ్ల పరిస్థితి ఇలానే ఉంది.

పెసా ఎన్నికలు ప్రశాంతం


మర్రిగూడలో ఎన్నికలు నిర్వహిస్తున్న ఎన్నికల అధికారి అమరేశ్వరి

సీతంపేట: మండలంలోని 20 గ్రామాల్లో పెసా (పంచాయతీరాజ్ ఎక్స్‌టెన్షన్ టు షెడ్యూల్డ్ ఏరియాస్) ఎన్నికలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. మర్రిగూడ, శంబాం, ఆడలి, ఎగువతొత్తడి, పెదరామ, మండ, మానాపురం, సామరెల్లి, తదితర గ్రామాల్లో ఎన్నికలు నిర్వహించారు. అన్నిచోట్ల ఎన్నికలు ఏకగ్రీవమైనట్లు ఎంపీడీఓ కె. గీతాంజలి తెలిపారు.

అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలి..


మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

గుమ్మలక్ష్మీపురం (కురుపాం): అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు కురుపాం మండలం పి.లేవిడి గ్రామంలో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను ప్రపంచ దేశాలు మేధావిగా గుర్తిస్తే.. మన దేశానికి చెందిన నాయకులు గుర్తించకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సూరయ్య, తదితరులు పాల్గున్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీవరం

గుమ్మలక్ష్మీపురం: విద్యార్థులు బాగు చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకుని కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీవరం అన్నారు. మండల కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడుతూ.. క్రమశిక్షణతో చదువుకున్నప్పుడు మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. నేషనల్ కెరీర్ సర్వీస్ సంస్థ సభ్యుడు అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు సాఫ్ట్ సిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై పట్టు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ సభ్యురాలు కల్పన, అధ్యాపకురాలు స్వరూప, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

అలరిస్తున్న ఏజెన్సీ అందాలు


సిరికొండ సమీపంలో ఆహ్లాదకరంగా కనిపిస్తున్న కొండలు

పాలకొండ: తుఫాన్ నేపథ్యంలో మూడు రోజులుగా ఏజెన్సీ ప్రాంతంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వాతావరణంలో పలు మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ వాతావరణం ఏజెన్సీ ప్రాంతానికి వచ్చే పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తోంది. నీలిమేఘాలు కొండలను ముద్దాడుతూ అబ్బురపరుస్తున్నాయి. ప్రధానంగా పాలకొండ పట్టణం నుంచి సీతంపేట ఏజెన్సీకి వెళ్లే రహదారిలో కొండలపై పచ్చదనం, మేఘాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి.

అధ్వానంగా సీఎస్పీ రహదారి


నవగాం సమీపంలో అధ్వానంగా సీఎస్పీ రోడ్డు

వీరఘట్టం: వీరఘట్టం – పాలకొండ సీఎస్‌పీ రహదారి అధ్వానంగా మారింది. ఈ రోడ్డుపై భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో రోడ్డు మొత్తం గోతులతో నిండిపోయింది. ముఖ్యంగా వండువ జంక్షన్ నుంచి నవగాం జంక్షన్ వరకు సుమారు రెండు కిలోమీటర్ల రోడ్డు మొత్తం చిత్తడిగా మారింది. గోతుల్లో నీరు చేరిపోవడంతో రాకపోకలకు వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికే ఈ రోడ్డుపై పలు ప్రమాదాలు జరగగా..చాలా మంది క్షతగాత్రులయ్యారు. ఈ నెల 8న జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మరణించాడు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సీఎస్పీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.


వండవ జంక్షన్ సమీపంలో రోడ్డుపై చేరిన నీరు

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

- జిల్లా వైద్యారోగ్య శాఖ ప్రోగ్రాం అధికారి జగన్ మోహన్‌రావు


కేఆర్‌బీ పురం పీహెచ్‌సీలో సిబ్బందికి సూచనలు చేస్తున్న డాక్టర్ జగన్ మోహన్‌రావు

కొమరాడ: గ్రామల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యారోగ్య శాఖ ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్ మోహన్‌రావు అన్నారు. మండలంలోని కొమరాడ, కేఆర్‌బీ పురం పీహెచ్‌సీలను శుక్రవారం ఆయన సందర్శించారు. అలాగే కుమ్మరిగుంట గ్రామంలో పర్యటించి ప్రజలతో మాట్లాడారు.

ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. మలేరియా, డెంగీ, డయేరియా ప్రబలకుండా ఏమేం జాగ్రత్తలు పాటించాలో వివరించారు. అంతకుముందు పీహెచ్‌సీ రికార్డులను పరిశీలించి, రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యులు శిరీషా, గణేష్ పట్నాయక్, తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షానికి రైతన్న విలవిల..


వీరఘట్టం: వండువ సమీపంలో తడిసి ముద్దవుతున్న వరి కుప్పలు


వీరఘట్టం: తెట్టంగి సమీపంలో రోడ్డు పక్కన మిల్లుకు తరలించేందుకు ఉంచగా తడిసిపోయిన ధాన్యం బస్తాలు

అన్నదాతల రెక్కల కష్టం వరుణుడిపాలైంది. వాయుగుండం ప్రభావంతో గడిచిన మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పొలాల్లో ఉన్న వరి పనలు, కళ్లాల్లో ఉన్న ధాన్యం బస్తాలు తడిసిముద్దవుతున్నాయి. కళ్లముందే ధాన్యం తడిసిపోతుండడంతో దిగుబడిని కాపాడుకునేందుకు రైతులు ఎంతో శ్రమిస్తున్నారు. బస్తాలపై టార్పాలిన్లు, గడ్డి కప్పి ధాన్యం తడవకుండా చూస్తున్నారు. వర్షానికి ధాన్యం రంగుమారే అవకాశం ఉందని.. ప్రభుత్వం రంగుమారిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు. ఇదిలా ఉంటే పాలకొండలో కొంతమంది కళ్లాల్లో ఉన్న 25 ధాన్యం బస్తాలను గుర్తు తెలియని ఎత్తుకెళ్లిపోవడంతో బాధిత రైతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

– వీరఘట్టం/ పాలకొండ రూరల్/భామిని


వీరఘట్టం: కుమ్మరిగుంట సమీపంలో రోడ్డు పక్కన తడిసిపోతున్న ధాన్యం బస్తాలు


భామిని: గురండిలో ధాన్యం రాశులపై కప్పిన టార్పాలిన్లు


పాలకొండ రూరల్: పాలకొండ శివారులో ధాన్యం బస్తాలు తడిచిపోకుండా కప్పిన గడ్డి